రహదారులకు కొత్త రూపు !

- చిల్లాపురం, రైల్వేస్టేషన్ మార్గాల్లో రూ.5.60కోట్లతో రోడ్ల నిర్మాణం
- ఇప్పటికే పూర్తయిన రైల్వేస్టేషన్ సీసీ రోడ్డు
- శరవేగంగా పనులు జరుగుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



బైపాస్ నుంచి విస్తరణ పనులు జరుగుతున్న చిల్లాపురం రోడ్డు



పూర్తయిన రైల్వేస్టేషన్ రోడ్డు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణం లోని బైపాస్ నుంచి చిల్లాపురం, రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గాలకు మహర్దశ పట్టనుంది. ఎప్పుడో వేసిన చిల్లాపురం రోడ్డు పూర్తిగా పాడై గుంతల మయంగా మారడంతో ఆ మార్గం గుండా వెళ్లే అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పట్టణంలోని 10వ వార్డు రవీంద్రనగర్ గుండా వెళ్లే ఈ రోడ్డు అజ్మీరాతండా, గోన్యాతండా, వీర్లపాలెం, ట్యాంక్‌తండా, చిల్లాపురం, పెద్దదేవులపల్లి తదితర గ్రామాలతో పాటు పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు వీలుంది. ఈ రోడ్డు గుండా నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

చురుగ్గా రోడ్డు పనులు

కాగా చిల్లాపురం రోడ్డు నిర్మాణానికి రూ.5కోట్ల రూపాయలు, రవీంద్రనగర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.60 లక్షలు మంజూరు కావడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. నూతనంగా వేస్తున్న రోడ్డును విస్తరించి రెండు లేన్లుగా వేస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చిల్లాపురం రోడ్డుకు అనుబంధంగా ఉన్న రైల్వేస్టేషన్ రోడ్డు పూర్తిగా 60ఫీట్ల వెడల్పుతో సీసీ వేశారు. దీంతో పట్టణం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా చిల్లాపురం రోడ్డు ఇప్పటికే కొంతమేర పూర్తి అయింది. రోడ్డుపై ఉన్న కల్వర్టులు సైతం నిర్మించి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేస్తున్నారు. పాత రోడ్డును పూర్తిగా తవ్వి కంకర పర్చి మట్టిని సైతం చదును చేసి తారు రోడ్డు వేసేందుకు సిద్ధం చేశారు. కొద్ది రోజుల్లో రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

ఇబ్బందులు తొలగుతాయి



రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో మా కాలనీ వాసులతో పాటు ఈ రోడ్డు గుండా వెళ్లే పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండే వారు. దీంతో వారి ఇబ్బందులను ఎమ్మెల్యే భాస్కర్‌రావు దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డును బాగు చేయాలని విన్నవించాం. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే రోడ్డు వేసేందుకు నిధులు విడుదల చేయించి పనులను వేగంగా పూర్తి చేయిస్తున్నారు.

– గొంగటి సైదిరెడ్డి, రవీంద్రనగర్

ఆనందంగా ఉంది



గతంలో ఈ రోడ్ల గుండా ప్రయాణించాలంటేనే తీవ్ర ఇబ్బందిగా ఉండేది. గుంతలమయంగా ఉన్న రోడ్లతో వాహనాలు పాడై ఆర్థికంగా తీవ్ర నష్టం వచ్చేది. రైల్వేస్టేషన్ వెళ్లాలంటే మోకాల్లోతు గుంతలు ఉండేవి. ఇప్పుడు పూర్తిగా సీసీ వేయడంతో పాటు చిల్లాపురం రోడ్డును విస్తరిస్తున్నారు. దీంతో కాలనీ ప్రజలందరికీ ఎంతగానో మేలు జరుగుతుంది.

– నెహ్రూ, రవీంద్రనగర్ కాలనీ, మిర్యాలగూడ

పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



కొండభీమనపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ: గ్రామపంచాయతీల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మన ఊరు- మనప్రభుత్వం- మన పథకాలు కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మండల పరిధిలోని బద్యానాయక్‌తండాలో రూ.25లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులు, రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం, కొండభీమనపల్లిలో రూ.25లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులు, రూ.14.50 లక్షలతో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, జెడ్పీటీసీ అరుణసురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీఓ శర్మ, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్, శిరందాసు కృష్ణయ్య, టీవీఎస్ రెడ్డి, సర్పంచ్‌లు మునుకుంట్ల విద్యావతివెంకట్‌రెడ్డి, సీత్యాశ్రీనునాయక్, ఎంపీటీసీ గమ్లీబాయి బద్యానాయక్, వశ్యానాయక్ ఉన్నారు.

ముత్తమ్మ మృతి బాధాకరం

చింతపల్లి : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు, ఎల్లంకి అశోక్ తల్లి ముత్తమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందింది. బుధవారం ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నట్వ గిరిధర్, దొంతం చంద్రశేఖర్ రెడ్డి, గోపిడి కిష్టారెడ్డి, తదితరులున్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



ఆర్డీఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో మాట్లాడుతున్న నరేష్

దేవరకొండ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్డీఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పట్టించుకోక పోవడంతో ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో విద్యారంగం గాడి తప్పిందని ఆయన పేర్కొన్నారు.సంక్షేమ వసతి గృహాలు,కస్తూర్బా పాఠశాలలో కనీస వసతులు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆరోపించారు.అంతకు ముందు పట్టణంలో విద్యార్థులతో కలిసి భారీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్, బుడిగ వెంకటేష్, రాహుల్, శ్రావణ్, చందు, గోపి, రవి, తదితరులున్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక

- నాగార్జున సాగర్ ఎమ్మెల్యే భగత్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే భగత్

హాలియా : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. త్రిపురారం మండలంలోని రాగడప, కంపాసాగర్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం హాలియా పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భగత్ పార్టీలో చేరిన వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ దేశ ప్రజల ఆకాంక్షతోనే బీఆర్‌ఎస్ పార్టీ ఉద్భవించిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధే దేశమంతా ఆచరిస్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలంతా కలిసి బీఆర్‌ఎస్ పార్టీలో చేయడం సంతోషకరమన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలంతా కోరుకుంటున్నారని, నియోజకవర్గ ప్రజలందరూ బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో నిడమనూరు ఎంపీపీ బొల్లం జయమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ దూళిపాల రామచంద్రయ్య, నిడమనూరు మండల ఎంపీపీ గౌరవసలహాదారు బొల్లం రవి, మండల అధ్యక్షుడు తాటి సత్యపాల్, దస్తగిరి, సర్పంచ్‌లు అడవయ్య, రేవూరి కొండల్ నాయకులు సైదులు, రేవూరి కోటయ్య తదితరులు ఉన్నారు.

బీసీలకు న్యాయం చేయాలి

దేవరకొండ: విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బిసీలకు తగిన న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. బుధవారం దేవరకొండలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఎనిమిదేళ్లలో బిసీలకు ఒరిగిందేమి లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు బిసీలకు ఎలాంటి కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం మంజూరు చేయలేదన్నారు. బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో చొల్లేటి భాస్కరాచారి, నేతాళ్ల వెంకటేష్,నర్సింహ, నాగయ్య, సురేష్ పాల్గొన్నారు.

మాఘ మాసం పూజలు

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని చిన్న మునిగల్ గ్రామ సమీపంలోని కృష్ణా వెనుక జలాల సమీపంలో ఉన్న గోపాల స్వామి దేవాలయంలో మాఘ మాసం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాపలపాయతండాకు చెందిన అమ్రా కుటుంబానికి చెందిన సుమారు 80 మంది భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు బిచ్చునాయక్, జబ్బర్‌లాల్, రమేశ్‌నాయక్, శ్రీనునాయక్, హరి, సోమాని, కాసన్, విజయ్, వినోద్, శ్రీను, భోజ, పవన్, హన్మానాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషిచేయాలి



నూతన కమిటీ సభ్యులతో కాంగ్రెస్ నేతలు

హాలియా : అనుముల మండలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని పులిమామిడి గ్రామంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. పులిమామిడి గ్రామ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మాలే జానారెడ్డి, లక్ష్మారెడ్డి ఉపాధ్యక్షులుగా బొమ్మపాల మహేష్, నడ్డి నాగయ్య, వీరెల్లి శంకర్, కోశాధికారిగా నకిరేకంటి మధు, ప్రచార కార్యదర్శిగా రుద్రాక్షి గణేష్, సంయుక్త కార్యదర్శిగా కన్నెబోయిన లింగయ్య, సహాయ కార్యదర్శిగా దైద యాదయ్య, కార్యదర్శిగా కంపసాటి రాము, యూత్ అధ్యక్ష, కార్యదర్శులుగా వడ్డెగోని కృష్ణ, గుండెబోయిన రామాంజనేయులు ఉపాధ్యక్షులుగా కోటయ్య, చెరుకుపల్లి రాజేష్, సంయుక్త కార్యదర్శిగా పజ్జూరి ప్రవీణ్, ప్రచార కార్యదర్శిగా సురభి కోటయ్య, కోశాధికారిగా నకిరేకంటి నాగయ్య, కార్యదర్శిగా బొమ్మపాల సైదులు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాలే అరుణసత్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ కాటేపల్లి అశోక్, కుందూరు రాజేందర్ రెడ్డి, నకిరేకంటి సైదులు, మహేశ్వరం వెంకటా చారి, రాములు, కొల్లు కవితవెంకట్‌రెడ్డి, ఆదేపు కొండయ్య, శ్రీను, సుధాకర్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



అడవిదేవులపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

అడవిదేవులపల్లి : మిర్యాలగూడ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు అన్నారు. బుధవారం మండలంలో రూ.90లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, మాజీ ఎంపీపీ కురాకుల మంగమ్మ, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు కూరాకుల చిన రామయ్య, కుర్ర శ్రీనునాయక్, కొత్త మర్రెడ్డి, గురువయ్య, ముత్యాలు, సూర్యానాయక్, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్‌రావు తదితరులున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

అడవిదేవులపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ యూత్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్నేహాభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు సందర్శించారు. అనంతరం పరీక్షల కోసం వచ్చిన వారిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ కేసా రవి, ఎంపీడీవో మసూద్ షరీఫ్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

అడవిదేవులపల్లి మండలం ఉల్సాయి పాలెం గ్రామానికి చెందిన వార్డు సభ్యులతో పాటు వంద మంది కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

పాత పద్ధతిలోనే పోలీసు నియామకాలు చేపట్టాలి



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ: పాత పద్ధతిలోనే పోలీసు నియామకాలను చేపట్టాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అజారుద్దిన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు పట్టణంలోని అభ్యర్థుల నుంచి సంతకాలు సేకరించి ఆయన మాట్లాడారు. గతంలో ఐదు ఈవెంట్లకుగాను మూడు ఈవెంట్లలో అర్హత సాధిస్తే ఫైనల్ పరీక్షకు అర్హత ఇచ్చేవాళ్లని కానీ ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా కఠిన నిబంధనలను పెట్టి పోలీసు నియామకాలను చేపడుతుందన్నారు. దీంతో 20 మంది నిరుద్యోగులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో 70వేల మంది నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి గతంలో చేపట్టిన విధంగానే ప్రస్తుతం కూడా పోలీసు నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, కౌన్సిలర్లు గంధం రామకృష్ణ, దేశిడి శేఖర్‌రెడ్డి, షేక్ అబ్దుల్లా, నాయకులు మాతంగి సంజీవ, కిషన్‌నాయక్, శివనాయక్, పర్వేజ్‌ఖాన్, సతీష్‌నాయుడు, చంటి, సురేష్, ఇమ్రాన్, మస్తాన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

మిర్యాలగూడ : విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతోపాటు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలు, పదోన్నతులు కల్పించాని బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు గత 18 సంవత్సరాల నుంచి ఒక్క పదోన్నతి కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పానుగోతు చత్రునాయక్, రమావత్ రవినాయక్, గుగులోతు గోపినాయక్, పానుగోతు సైదానాయక్, ధర్మానాయక్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంత శ్రీరామ్, త్రిపురనేని దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న భట్రాజుల సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : భట్రాజుల కులస్తులపై అనంత శ్రీరామ్, త్రిపురనేని చిట్టిబాబుల చేసిన అనుచిత వాఖ్యాలకు నిరసనగా భట్రాజుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాగర్ రోడ్డులో వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ముందుగా తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి అనంత్ శ్రీరామ్, చిట్టిబాబుల ఫ్లెక్సీలతో శవయాత్ర నిర్వహించి చెప్పులతో కొట్టారు. అనంతరం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భట్రాజుల సంఘం జిల్లా అధ్యక్షుడు సరికొండ నర్సరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తంగెళ్ల పిచ్చంరాజు, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దూపాటి సత్యనారాయణరాజు, సరికొండ రుషికేశ్వర్‌రాజులు మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రాజు, సరికొండ ప్రీతంరాజు, పూర్ణచందర్‌రాజు, తంగేళ్ల హరికృష్ణం రాజు, మహేష్‌రాజు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ : ఆర్డీఓ



మిర్యాలగూడ : మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య



హాలియా: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ మంగ

మిర్యాలగూడ అర్బన్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధంగా పని చేస్తుందని మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 13వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ, అకాడమిక్ కో ఆర్డినేటర్ భిక్షమయ్యగౌడ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కొండమల్లేపల్లి: ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కొండమల్లేపల్లి తహసీల్దార్ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఓటు వజ్రాయుధం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధమని, దానికి నోటుకు అమ్ముకోకుండా సరైన నాయకుడిని ఎన్నుకోవాలని ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇస్లావత్ పాండు నాయక్, ఎంపీడీఓ ఖాజా అస్గర్‌అలీ, ఎంపీఓ పద్మ, సర్పంచ్ శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

త్రిపురారం : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కేసీ ప్రమీలా అన్నారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సైదులు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

హాలియా : ప్రభుత్వం కల్పిస్తున్న ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ మంగ అన్నారు. జాతీయ ఓటుహక్కు దినోత్సవం సందర్భంగా బుధవారం హాలియాలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఓటర్ల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసా వెంకన్న బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకురాతి అమృతయ్య, మందా సైదులురావు గౌతమ్, పల్‌రెడ్డి నిర్మలా, రామకృష్ణ, వద్యా సునిత, గారపాటి శ్యామలాదేవి, తీగల మల్లిఖార్జున కోరేపాక చంద్రకళ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం లాంటిది

పెద్దవూర: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని మండల తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం కె.శ్రీనివాస్, ఆర్ఐ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంధత్వ నివారణకు కృషి

పెద్దవూర : అంధత్వ నివారణకు ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్వాలిటీ కంట్రోల్ అధికారి డాక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం మండలంలోని బట్టుగూడెం, లింగంపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్వామి, మెడికల్ ఆఫీసర్ నగేష్, వెంటకస్వామి పాల్గొన్నారు.

లావాదేవీలపై అవగాహన ఉండాలి

కొండమల్లేపల్లి : ప్రతి ఒక్కరూ బ్యాంక్ లావాదేవీల పట్ల అవగాహన కలిగి ఉండాలని విడ్స్ స్వచ్ఛంద సంస్థ మండల సమన్వయకర్త గిరి అంకులమ్మ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎస్‌బీఐ సౌజన్యంతో సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు బ్యాంకింగ్ రంగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, గిరి ఉన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

హాలియా : మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త లింగాల ప్రభాకర్ బుధవారం హాలియా మున్సిపల్ కమిషనర్ కందిమల్ల వీరారెడ్డి వినతి పత్రం సమర్పించారు.

అంతిమ సంస్కారాలకు ఆర్థికసాయం

హాలియా : పట్టణంలోని 5వ వార్డుకు చెందిన గాదం సాయమ్మ(90) కొంతకాలంగా అనార్యోగంతో బాధపడుతూ బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న హాలియా మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి బాధిత నివాసానికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలు అంతిమ సంస్కారాలకుగాను రూ. 5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు, వర్కాల మల్లారెడ్డి, కమతం రామాంజిరెడ్డి, పాదం వెంకటేశ్వర్లు ఉన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

డిండి: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌పై బీజేపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఆ పార్టీ డిండి పట్టణ అధ్యక్షుడు గిరమోని శ్రీను అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మహిళ ఎంపీటీసీ రాధికను ఎమ్మెల్యే హేళన చేసి మాట్లాడనడం అవాస్తవమని, మహిళ ప్రజాప్రతినిధులను గౌరవించే సంస్కృతి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రజల ఆశీర్వాదంతోనే రవీంద్రకుమార్ మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన విషయం బీజేపీ నాయకులు మరిచిపోవద్దన్నారు. ఆయన వెంట పలువురు ఆ పార్టీ నాయకులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దవూర: మండల కేంద్రంలో బుధవారం పశుగణాభివృద్ధి సంస్థ క్యాలెండర్‌ను ఆ సంస్థ క్లస్టర్ సూపర్‌వైజర్, బీసీ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నడ్డి బాలరాజ్‌యాదవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పెర నాగయ్య, గాలి లింగారెడ్డి, కల్లూరి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి గ్రామపంచాయితీ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్ కోరారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సమావేశంలో గ్రామపంచాయతీ పరిధిలో భవిష్యత్తులో ఆయా వార్డుల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై చర్చించి పలు అంశాలపై తీర్మానం చేశారు. సమావేశంలో ఉపసర్పంచ్ గంధం సురేష్,వార్డు సభ్యులు కొణిదెల వెంకటయ్య ,పెద్దిశెట్టి సత్యనారాయణ ,సనీత ఉన్నారు.

ఘనంగా గంధోత్సవం



ఖవ్వాలీలో పాల్గొన్న భక్తులు

డిండి: మండల కేంద్రంలోని హఖ్ఖానీ షా సాహెబ్ దర్గా గంధోత్సవం బుధవారం తెల్లవారుజామున భక్తులు ఘనంగా నిర్వహించారు. దర్గా ఆవరణలో ఖత్మేఖురాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఖవ్వాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్‌కర్నూల్ జిల్లా దర్గా పీఠాధిపతి షాకీర్ పాషా పాల్గొన్నారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు హన్మంతు, కార్యకర్తలు కిషన్, బీమయ్య, శివాజీ, హబీబ్, రహీం, మోహనయ్య, షర్ఫొద్దీన్ పాల్గొన్నారు.

గంధం ఊరేగింపు

చింతపల్లి : మండల పరిధిలోని కుర్రంపల్లిలోని హజరత్ మహమూద్ సుభాని గంధం ఊరేగింపు బుధవారం తెల్లవారుజామున గ్రామ పుర వీధుల గుండా ఒంటెపై వైభవంగా నిర్వహించారు. భక్తులు హజరత్ మహమూద్ సుభానిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కేతావత్ బిల్యానాయక్, షేక్ గోరేమియా, షేక్ ఉమర్‌పాషా, మోహిన్ పాషా, సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, కిరణ్, జైపాల్‌నాయక్ పాల్గొన్నారు.

బేటీ బచావో-బేటీ పడావో

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ అధికారులు బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ మాట్లాడుతూ ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణించాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శోభ ఉన్నారు.

ఎంసెట్ తరగతులు బోధించాలి : డీఐఈఓ

దేవరకొండ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఎంసెట్ తరగతులు బోధించాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి (డీఐఈఓ) దస్రూనాయక్ సూచించారు. బుధవారం దేవరకొండలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కళాశాల విద్యార్థులకు ఉదయం స్టడీఅవర్, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ పూర్తి చేయాలన్నారు. బోర్డు నిబంధనల మేరకు సిలబస్‌ను పూర్తిచేయాలన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మల్లయ్య, అధ్యాపకులున్నారు.

డీఐఈఓకు వినతి..

దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించకోవాలని కోరుతూ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం డీఐఈఓ దస్రూనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాల ఆవరణలో మార్కెట్ ఏర్పాటు చేస్తే ఆటస్థలం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు కార్యక్రమంలో వంగూరి వెంకటేశ్వర్లు, కుమార్‌నాయక్, కోటేష్, సాయి, సతీష్, అర్జున్ తదితరులున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొండమల్లేపల్లి : ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని డీఐఈఓ దస్రూనాయక్ సూచించారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ క్రాంతి, సాయి ప్రకర్ష జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట లతీఫ్, కళాశాల నిర్వాహకులు డి.అశోక్, ఎర్రమద గోవర్ధన్‌రెడ్డి, రమేశ్ తదితరులున్నారు.

క్రీడలతో స్నేహభావం

దేవరకొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని దేవరకొండ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రవీందర్,అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉల్లం అజయ్ అన్నారు. బుధవారం దేవరకొండ న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రవీందర్,అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉల్లం అజయ్ జట్ల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలకు సీఐ శ్రీనివాసులు ఎంపైర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నెమ్మికంటి రమాశంకర్, సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వర్, క్రీడా సెక్రటరీ రియాజ్, న్యాయవాదులు వనం శ్రీనివాసులు, వనం జగదీశ్వర్, మాడెం రాములు, ఇడెం రవికుమార్, కోరె శ్రీనివాస్, కొమ్ము రాజశేఖర్, ఎర్ర కృష్ణ, కేతావత్ శంకర్, రమావత్ గణేష్, దుగ్గె వెంకన్న, కొర్ర రాంసింగ్, సాయి పాల్గొన్నారు.